# నమస్తే తెలంగాణ

# నాగర్‌కర్నూల్

5 | మహబూబ్‌నగర్, మంగళవారం 18 జూన్ 2024 | NAGARKURNOOL


## జూరాలకు కొనసాగుతున్న వరద

- ఇన్‌ఫ్లో 6,691, అవుట్‌ఫ్లో 2,779 క్యూసెక్కులుగా నమోదు

గద్వాల, జూన్ 17 : జూరాల ప్రాజెక్టుకు వరద కొనసాగుతున్నది. ప్రతిరోజూ జూరాలకు వరద తగ్గుతూ పెరుగుతూ ఉన్నది. సోమవారం ఎగువ నుంచి 6,691 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.869 టీఎంసీలు ఉన్నది. కాగా నెట్టెంపాడ్ లిఫ్ట్‌కు 375, భీమా లిఫ్ట్-1కు 650, కోయిల్‌సాగర్ లిఫ్ట్‌కు 315, సమాంతర కాల్వకు 800, భీమా లిఫ్ట్-2కు 583 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. దీంతో అవుట్‌ఫ్లో 2,779 క్యూసెక్కులుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

**ఆర్డీఎస్‌కు ఆనకట్టకు స్వల్ప వరద**

అయిజ, జూన్ 17 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు స్వల్ప వరద కొనసాగుతున్నది. 4,329 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్ ఫ్లో 4,329 క్యూసెక్కులు సుంకేసుల బ్యారేజీకి చేరుతోందని ఏఈ రాందాస్ తెలిపారు. ప్రస్తుతం ఆనకట్టలో 8.6 అడుగుల నీటిమట్టం ఉన్నది.

**తుంగభద్ర డ్యాంకు..**

తుంగభద్ర డ్యాంకు వరద కొనసాగుతున్నది. 1,850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్ ఫ్లో 301 క్యూసెక్కులుగా నమోదైంది. డ్యాం 100.855 గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 6.070 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.



ఆర్డీఎస్ ఆనకట్టపై నుంచి పారుతున్న వరద

## జిల్లా పోలీస్ బాస్‌ల బదిలీ

- పాలమూరు ఎస్పీగా జానకి ధరావత్, గద్వాల ఎస్పీగా శ్రీనివాసరావు


మహబూబ్‌నగర్/ గద్వాల అర్బన్, జూన్ 17 : రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులకు స్థానచలనం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. అందులో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ బాస్‌గా జానకి ధరావత్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సారి 28 మంది ఎస్పీలను బదిలీ చేయగా 2013 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన జానకి ధరావత్ ఈస్ట్‌జోన్ హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తుండగా మహబూబ్‌నగర్ ఎస్పీగా బదిలీ చేశారు. ఈమె గతంలో మల్కాజ్‌గిరి డీసీపీగా పనిచేశారు. ఇక్కడ పనిచేస్తున్న హర్షవర్ధన్‌కు హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ బ్యూరోగా పోస్టింగ్ ఇచ్చారు. జానకి ధరావత్ మంగళ వారం





జానకి ధరావత్, శ్రీనివాసరావు

బాధ్యతలు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే జోగుళాంబ గద్వాల ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న రితిరాజ్‌ను ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా హైదరాబాద్‌కు బ దిలీ చేశారు. ఆమె స్థానంలో సైబరాబాద్ జోన్ బాలానగర్ డీసీపీగా విధులు నిర్వహిస్తున్న టి.శ్రీనివాసరావును ఎస్పీగా నియమిస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన రెండు, మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని పోలీస్ వర్గాలు తెలిపాయి.





**ముఖం చాటేసిన మబ్బులు**

# ఆకాశం వైపు.. రైతన్న చూపు

- వానకాలం సాగుపై నీలినీడలు
- వరుణుడి రాకకోసం ఎదురుచూపు
- పదిరోజులుగా పత్తాలేని వానలు
- విత్తనాలు విత్తిన రైతుల్లో ఆందోళన
- పైపులు, స్ప్రింక్లర్లతో పొలాలకు నీళ్లు
- మరో వారం జాప్యమైతే రైతుకు నష్టమే..

వానమ్మ...వానమ్మ.. వానమ్మా.. ఒక్కసారన్నా వచ్చిపోవే వానమ్మా.. అని పాడుకునే పరిస్థితులొచ్చాయి రైతన్నలకు. పది రోజులుగా వరుణుడు పత్తా లేకపోవడంతో రైతులు ఆకాశం వంక ఆశతో ఎదురు చూస్తున్నారు. గతేడాది మాదిరిగా ఈనెలలో కూడా ముందుగానే పలకరించిన తొలకరితో విత్తనాలు వేసుకున్న కర్షకులు ఇప్పుడు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. మరో వారం రోజులు ఇలాగే ఉంటే వేసిన విత్తనాలు భూమిలో కలిసిపోతాయేమో ననే బెంగ రైతుల్లో నెలకొన్నది.

*- నాగర్‌కర్నూల్, జూన్ 17 (నమస్తే తెలంగాణ)*

వరుణుడి కరుణ కోసం రైతన్నలు ఎదురు చూస్తున్నారు. తొలకరితో కురిసిన వర్షాలకు రైతన్నలు సంబురపడ్డారు. గతేడాది కూడా తొలకరిలో సమృద్ధిగానే వర్షాలు కురిశాయి. దీంతో ఈసారి కూడా అదేవిధంగా వానలు పడడంతో రైతులు చాలా మంది పత్తి, జొన్న, మొక్కజొన్న తదితర విత్తనాలను విత్తుకొన్నారు. వాతావరణ శాఖ అంచనాలకంటే ముందుగానే నైరుతి రుతుపవనాలు ప్రవేశించడం, విస్తరించడంతో రైతులు సంబురపడ్డారు. అయితే అది ఆరంభంగానే మారింది. గత పదిరోజుల నుంచి దాదాపుగా వర్షాలు కురియడం లేదు. ఈ వారం నుంచి మళ్లీ భానుడి భగభగలు సెగలు కక్కిస్తున్నాయి. వానలు పడ్డాయని భావించిన రైతులు, ప్రజలకు మళ్లీ వేసవికాలం గుర్తొస్తోంది. దీంతో సాధారణ ప్రజలకంటే ముఖ్యంగా రైతన్నలకు ఈ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. తొలకరి వానలు మంచిగానే కురిశాయి. దీనివల్ల భూమి కూడా చల్లబడింది. ఫలితంగా రైతులు విత్తనాలను నాటుకొన్నారు. ఎరువులు తదితర వాటిని కొనుగోలు చేసుకొన్నారు. ఇక వ్యవసాయ శాఖ ముందస్తుగానే అప్రమత్తమైంది. కానీ గత వారం, పది రోజుల నుంచి వానలు కురియక రైతులు ఆకాశం వంక చూస్తున్నారు. ఈ సీజన్‌లో ఎప్పటిలాగే రైతులు పత్తికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లుగా వ్యవసాయశాఖ అంచనాలు రూపొందించింది. మిగిలిన మొక్కజొన్న, జొన్న లాంటి విత్తనాలను పలువురు రైతులు విత్తుకొన్నారు. వేసిన విత్తనాలు ఎప్పుడు మొలకెత్తుతాయోనని రైతులు ఓవైపు భూమి వంక చూస్తూ మరోవైపు వానకోసం ఆకాశానికి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఈ వానకాలంలో 4.73 లక్షల ఎకరాల్లో పంటల సాగు చేస్తారని వ్యవసాయశాఖ అంచనాలు తయారు చేసింది. ఇందులో అధికంగా పత్తి 2.73లక్షల ఎకరాలు ఉండగా ఇప్పటి వరకు జిల్లాలో 96వేల ఎకరాల్లో విత్తనాలను నాటారు. నాటిన విత్తనాల్లో అధికంగా పత్తి విత్తనాలే 89,116 ఎకరాల్లో ఉండటం గమనార్హం. ఇక కందులు 565ఎకరాల్లో, మొక్కజొన్న 3,943ఎకరాల్లో, జొన్న 2,289ఎకరాల్లో నాటారు. ఇలా విత్తనాలు నాటిన రైతులు విత్తనాలు మొలకెత్తేందుకు వర్షాలు కురియాలని వరుణుడిని చేతులెత్తి మొక్కుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఈ వానకాలంలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 38.4 మిల్లీమీటర్లు కాగా సాధారణానికి మించి 151శాతం అధికంగానే 106 మిల్లీ మీటర్ల నమోదవ్వడం గమనార్హం. సీజన్ తొలివారంలో కురిసిన భారీ వర్షాలు సాధారణానికి మించి కనిపిస్తున్నా నాడు నాటిన విత్తనాలు మొలకెత్తే పరిస్థితులు ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారాయి. పత్తి విత్తనాలు మరోవారం రోజుల్లో వర్షాల కురిస్తే మొలకెత్తే పరిస్థితులు ఉన్నాయి. వరి నారు జూలైలో పోసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా రాబోయే మూడు, నాలుగు రోజుల్లో వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ చేస్తున్న ప్రకటనలే రైతులకు ఆశలు చిగురింపజేస్తుండగా పరిస్థితులు, వాతావరణం మాత్రం ఆ దిశగా కనిపించడం లేదు.



వసంతాపూర్ శివారులో పైపునకు ఏర్పాటు చేసిన రంధ్రాల సాయంతో నీటిని పారిస్తున్న మహిళా రైతు

### విత్తనాలను కాపాడుకోవాలి



జిల్లాలో రైతులు అధికంగా 90వేల ఎకరాల్లో పత్తి విత్తనాలను నాటారు. విత్తనాలు వేసిన రైతులు గుంటుకలు కొట్టి రక్షించుకోవాలి. అలాగే నీటి బోర్లు, కాల్వల్లో నీటి వనరులు ఉంటే నీళ్లను స్ప్రింక్లర్ల ద్వారా అందించుకోవాలి. వచ్చే వారం వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనలు ఉన్నాయి. వరి పంట నారును జూలైలో పోసుకోవాలి. మంచిగా వర్షాలు కురిశాకే రైతులు విత్తనాలు నాటుకోవడం మంచిది.

*- చంద్రశేఖర్, డీఏవో, నాగర్‌కర్నూల్ జిల్లా*

### నాగర్‌కర్నూల్ జిల్లాలో పంటల సాగు, విత్తనాలు

| పంట | సాధారణ సాగు | నాటిన విత్తనాలు (ఎకరాల్లో) |
|---|---|---|
| పత్తి | 2.73 లక్షలు | 89,116 |
| కందులు | 15,687 | 565 |
| మొక్కజొన్న | 65,685 | 3,943 |
| జొన్న | 6,279 | 2,289 |



మహబూబ్‌నగర్‌లో ఈద్గా వద్ద ముస్లింలు



ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి


# ఈద్ ముబారక్

- ఉమ్మడి జిల్లాలో భక్తిశ్రద్ధలతో బక్రీద్
- ఈద్గాలు, మసీదుల వద్ద ప్రార్థనలు
- ఖుర్బానీ సమర్పించిన ముస్లింలు
- ఘుమఘుమలాడిన ప్రత్యేక వంటకాలు
- శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజాప్రతినిధులు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో సోమవారం బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ముస్లింలు ఉదయమే కొత్త దుస్తులు ధరించి ఈద్గాలు, మసీదుల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు అలయ్‌బలయ్ చేసుకొని ఈద్ ముబారక్ తెలియజేసుకున్నారు. పొట్టేళ్లు కొనుగోలు చేసి ఖుర్బానీ సమర్పించారు. బంధువులను ఆహ్వానించి ఘుమఘుమలాడే వంటకాలతో ఆతిథ్యమిచ్చారు. పాలమూరు, వనపర్తిలో మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతీక బక్రీద్ అన్నారు. ముస్లింలు జరుపుకొనే పండుగలలో బక్రీద్ చాలా ప్రత్యేకమైందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పండుగలకు ప్రాధాన్యతను కల్పించే వారని గుర్తు చేశారు. అలాగే ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితోపాటు పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజాప్రతినిధులు ముస్లింలకు ఈద్ ముబారక్ తెలిపారు.

*- నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, జూన్ 17*





గద్వాల పట్టణంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

## ఐక్యతను అలవర్చుకోవాలి

వనపర్తి, జూన్ 17 : త్యాగానికి ప్రతీక బక్రీద్ అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన తన నివాసంలో ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు జరుపుకొనే పండుగలలో బక్రీద్ పండుగ చాలా ప్రత్యేకమైందన్నారు. ముస్లింలు మహ్మద్ ప్రవక్త త్యాగాన్ని స్మరించుకుంటూ త్యాగం, కరుణ, ఐక్యతలను అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో గత పది సంవత్సరాల కాలంలో కేసీఆర్ ప్రభుత్వంలో పండుగలకు ప్రత్యేకతను కల్పించే వారని తెలిపారు. రాష్ట్రంలో ఏ పండుగనైనా ప్రతిఒక్కరూ సోదర భావంతో జరుపుకొనే వాతావరణం ఉండేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితులే కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



ముస్లింలకు ఈద్‌ముబారక్ తెలుపుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

### శుభాకాంక్షల వెల్లువ

పాలమూరు, జూన్ 17 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ముస్లింలు బక్రీద్ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. సోమవారం పట్టణంలోని న్యూగంజ్ వద్దనున్న ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేయగా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరై ముస్లింలను ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ కేసీ నర్సింహులు, మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రెహమాన్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు ఉన్నారు.

### ముస్లింల కల నెరవేరింది : బండ్ల

గద్వాలటౌన్, జూన్ 17 : ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్న పెద్ద ఈద్గా నిర్మాణం కేసీఆర్ ప్రభుత్వంలో నేరవేరిందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని ఎమ్మెల్యే బండ్ల మాట్లాడుతూ దేవుడి దయవల్ల అందరూ సంతోషంగా ఉండాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ముస్లింల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందని, అదేవిధంగా మసీదులు, ఈద్గాల నిర్మాణానికి నిధులు కేటాయించి అభివృద్ధి చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బాబర్, కౌన్సిలర్లు నాగిరెడ్డి, నరహరి శ్రీనివాసులు, దౌలు, నాయకులు సుభాన్, రామన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే బండ్ల